
సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
సోమవారం । 19 । ఆగస్టు । 2024



రామయ్య చెంతకు రైలు బండేదీ!

ప్రఖ్యాత ఒంటిమిట్ట కోదండరామాలయంపై రైల్వేశాఖ చిన్నచూపు చూస్తోంది. ఒక్క ఎక్స్‌ప్రెస్ రైలుకు కూడా హాల్టింగ్ లేకపోవడం గమనార్హం. -8లో



కృష్ణా జట్టు ఘన విజయం

కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-19 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో కృష్ణా జట్టు ఘనవిజయం సాధించింది. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
37.0/27.8

వాతావరణం

జిల్లాలో ఆదివారం 27.8 - 37.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు పుష్పగిరికి ప్రత్యేక సర్వీసు



కడప కోటిరెడ్డిసర్కిల్: పౌర్ణమి సందర్భంగా జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పుష్పగిరికి ప్రత్యేక సర్వీసును నడపనున్నట్లు కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు తెలిపారు. సోమవారం ఉదయం 6 గంటలకు కడప ఆర్టీసీ బస్టాండు నుంచి ఈ బస్సు రాకపోకలు సాగిస్తుందన్నారు. సాధారణ చార్జీలతో ఈ బస్సులో భక్తులు ప్రయాణించవచ్చని ఆయన వివరించారు.

నేడు త్రేతేశ్వరుని గిరి ప్రదక్షిణ

రాజంపేట రూరల్: అత్తిరాలలోని శ్రీకామాక్షి సమేత త్రేతేశ్వరస్వామికి శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం సాయంత్రం 6గంటలకు గిరి ప్రదక్షిణ చేయనున్నట్లు త్రేతేశ్వరస్వామి భక్తమండలి కమిటీ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాదం అందజేయనున్నట్లు చెప్పారు. పదక్షిణ అనంతరం భక్తుల సౌకర్యం కోసం బస్సు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

నేడు డయల్ యువర్ కలెక్టర్

కడప సెవెన్‌రోడ్స్: ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు సోమవారం డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు 08562-244437 ల్యాండ్ లైన్ నంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవాలని కలెక్టర్ సూచించారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో కడపకు కాంస్యం



రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో మూడో స్థానంలో నిలిచిన కడప బాలికల జట్టు

కడప స్పోర్ట్స్: సత్యసాయి జిల్లా కదిరిలో నిర్వహించిన 46వ రాష్ట్రస్థాయి బాలికల చాంపియన్‌షిప్ పోటీల్లో కడప బాలికల జట్టు సత్తాచాటింది. మూడోస్థానం కోసం నిర్వహించిన పోటీల్లో శ్రీకాకుళం జట్టుతో తలపడగా, 4-4 పాయింట్లతో ఇరుజట్లు సమంగా నిలువడంతో సంయుక్తంగా మూడోస్థానాన్ని ప్రకటించారు. దీంతో కడప బాలికల జట్టు మూడోస్థానంలో నిలిచి కాంస్యపతకాన్ని కైవసం చేసుకుంది. జిల్లా జట్టుకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ట్రోఫీని అందజేశారు. జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి వి.లక్ష్మణ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

రూరల్ సబ్ రిజిస్ట్రార్ శ్యామలాదేవి సస్పెన్షన్

కడప కోటిరెడ్డిసర్కిల్: గతంలో కడప రూరల్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన శ్యామలాదేవిని సస్పెండ్ చేస్తూ కర్నూలు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్) కల్యాణి ఉత్తర్వులు జారీ చేశారు. 2023లో కడప రూరల్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన సమయంలో పబ్బాపురం స్థలాల రిజిస్ట్రేషన్ విషయంలో ఈమె సస్పెండ్ అయ్యారు. ఆ తర్వాత అదే ఏడాది ఆమెపై సస్పెన్షన్ ఎత్తివేసి కర్నూలు ఆస్పరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఇంతవరకు ఆమె విధులకు హాజరు కాలేదన్నారు. విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగా శ్యామలాదేవిని సస్పెండ్ చేశామని పేర్కొన్నారు.

కర్నూలు క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా వైవీయూ అధ్యాపకుడు



కట్టా వెంకటేశ్వర్లు

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం కెమిస్ట్రీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు కర్నూలులోని క్లస్టర్ యూనివర్సిటీకి నూతన రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు హైదరాబాద్ ఐఐసీటీలో చేసిన ఈయన సౌత్ కొరియాలోని సియోల్ నేషనల్ యూనివర్సిటీలో పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ చేశారు. ప్రఖ్యాత జర్నల్స్‌లో 90 పరిశోధన పత్రాలను రాశారు. క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ గా నియమితులైన డాక్టర్ వెంకటేశ్వర్లు సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య పుత్తా పద్మ, అధ్యాపకులు ఆయన్ను అభినందించారు.

ఉద్యాన సాగు.. ఉపాధికి బాగు

- రాయితీలతో ఉద్యాన పంటలను ప్రోత్సహిస్తున్న కేంద్ర ప్రభుత్వం
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏడు వేల ఎకరాల్లో సాగుకు ప్రణాళికలు
- రోడ్లు, కాలువల వెంబడి మొక్కల పెంపకానికి చర్యలు
- ఉపాధి హామీ పథకం కింద ఉద్యాన రైతుకు సాయం



సాగులో ఉన్న డ్రాగన్ ఫ్రూట్



కడప సిటీ: ఉద్యాన పంటలను సాగు చేసే రైతులకు కేంద్ర ప్రభుత్వం ఊరట కలిగిస్తోంది. పండ్ల తోటలు, కూరగాయల సాగు, నీటి కుంటలు, ఉద్యాన యాంత్రీకరణ, మల్చింగ్ తదితర పథకాల కింద కేంద్ర ప్రభుత్వం రాయితీలిస్తోంది. ఇప్పటికే కేంద్రం ఆదేశాల మేరకు జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ఆయా మొక్కల పెంపకంపై ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ ఏడాది వేసవిలో ఉష్ణోగ్రతలు అధికం కావడంతో చెట్ల సంఖ్య భారీగా తగ్గిపోయింది. ఈ సంఖ్యను పూడ్చేందుకు రాబోయే రోజుల్లో మొక్కల పెంపకాన్ని మరింత అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. అర్హతగల రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏడు వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు అభివృద్ధి చేయాలన్న లక్ష్యంగా ప్రణాళికలు అధికారులు సిద్ధం చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి పండ్ల తోటల సాగును మరింత విస్తరించేందుకు చర్యలు చేపడుతున్నారు.

అలాగే ఉపాధి హామీ పథకంలో కూలీలకు మాత్రమే పనులు కల్పించడమే కాకుండా వారి సుస్థిర, ఆర్థికాభివృద్ధికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఇందులో భాగంగానే చిన్న, సన్నకారు రైతులు మార్కెట్‌లో ఎక్కువగా డిమాండ్ ఉన్న చీనీ, మామిడి, జామ, సన్ననిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, సపోట తదితర 13 రకాల పండ్ల తోటలను సాగు చేసుకునేందుకు 100 శాతం రాయితీ ఇచ్చి ప్రోత్సహిస్తోంది. కొన్ని పంటలకు మూడేళ్లపాటు నిర్వహణ ఖర్చులను కూడా ప్రభుత్వమే భరిస్తోంది.

ఉద్యాన హారం



జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఏడు వేల ఎకరాల్లో మొక్కలు నాటాలన్నది జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రధాన లక్ష్యంగా ఉంది. ఇప్పటివరకు 1907 ఎకరాల్లో ఉద్యాన పంటలను సాగు చేసేందుకు లబ్ధిదారులను గుర్తించారు. ప్రధానంగా జిల్లాలోని పులివెందుల, జమ్మలమడుగు, కమలాపురంలోని ఆయా మండలాల్లో చీనీ, నిమ్మ ప్లాంటేషన్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. మిగిలిన మండలాల్లో చీనీ, సన్న నిమ్మ, మామిడి, నాటు జామ, తైవాన్ జామ, సపోట, కొబ్బరి, శీతాఫలం, దానిమ్మ, నేరేడు, ఆపిల్ బేర్‌తోపాటు డ్రాగన్ ఫ్రూట్ సాగుకు ప్రోత్సాహం అందిస్తున్నారు. రాయితీ కింద మూడేళ్లపాటు నిర్వహణ చార్జీలు, ఎరువులు, పురుగుల మందులు, దుక్కులు, అంతర్ పంట మొక్కలు, గుంతలతో కలిపి సగటున ఎకరాకు మూడేళ్లకు రూ. లక్ష వరకు ప్రోత్సాహం అందుతోంది. అంతేకాకుండా మునగ సాగుపై కూడా ప్రభుత్వం శ్రద్ధ చూపుతోంది.

ఉద్యాన పంటల సాగు లక్ష్యం (ఎకరాల్లో)

- 7000 సాగు లక్ష్యం
- 1907 ప్రస్తుతం సాగులో ఉన్న భూమి
- 869 పంటల సాగుకు నిధులు మంజూరైనవి
- 65 ప్లాంటేషన్ పనులు జరుగుతున్నవి



నీటి వసతి లేకున్నా...

మెట్ట భూముల్లో ఉద్యాన పంటల సాగులో భాగంగా చీనీ పంటను మినహాయించి మిగిలిన పండ్ల తోటలకు రైతుకు బోరు లేదా బావి లేకున్నప్పటికీ హార్టికల్చర్‌లో లబ్ధి పొందే అవకాశం ఉంది. నీటి వసతి లేని రైతులకు నీళ్ల ట్యాంకుల ద్వారా సరఫరా చేసుకునేందుకు ఉపాధి హామీ ద్వారా ఆర్థికసాయం అందుతుంది.

ఆగస్టు చివరి వరకు గడువు

ఉద్యాన పంటల సాగుకు దరఖాస్తు చేసుకునేందుకు ఆగస్టు చివరి వరకు గడువు ఉంది. రైతులు పట్టాదారు పాసుపుస్తకం, నకలు, ఒరిజినల్ 1బీ, ఉపాధి జాబ్ కార్డు నకలు, జాబ్‌కార్డులోని వారందరి ఆధార్ నకలు, చిన్న, సన్నకారు రైతుల పత్రంతో కలిపి దరఖాస్తు పత్రాన్ని అందజేయాల్సి ఉంటుంది. ఆసక్తిగల రైతులు మండల అభివృద్ధి అధికారి లేదా మండల ఉపాధి హామీ కార్యాలయంలో ఏపీఓ లేదా గ్రామ ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడిని సంప్రదించాలి. -విజయ్‌కుమార్, ఇన్‌ఛార్జి డ్వామా పీడీ

21న జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ ఎంపికలు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో ఈనెల 21వ తేదీ ఉదయం 10 గంటలకు జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ ఎంపికలు నిర్వహించనున్నట్లు వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి టి. నారాయణరావు తెలిపారు. సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో బాలబాలికలకు ఎంపికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 31 నుంచి సెప్టెంబర్ 1వ తేదీ వరకు అనకాపల్లిలో నిర్వహించే రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని వివరించారు.

వనిపెంట కేవీకేకు ఉత్తమ అవార్డు




వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం

మైదుకూరు: తమిళనాడులోని తిరుచ్చి జాతీయ అరటి పరిశోధన కేంద్రం 31వ స్థాపిత దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రకటించిన అవార్డుల్లో మైదుకూరు మండల వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం ఉత్తమ కేవీకే అవార్డును దక్కించుకుంది. ఉత్తమ కేవీకే అవార్డుల విభాగంలో అరటి పరిశోధనలు, రైతులకు చేసిన ఉత్తమ సహాయ సహకార శిక్షణ, అవగాహన సదస్సులకుగాను వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రానికి ఈ అవార్డు లభించిందని కేవీకే అధిపతి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ విలేకరులకు తెలిపారు. ఐసీఏఆర్, అటారీ జోన్ -10 హైదరాబాద్ కింద ఉన్న కేవీకేలలో వనిపెంటకు ఈ అవార్డు వచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 21వ తేదీన తిరుచురాపల్లెలోని జాతీయ అరటి పరిశోధన కేంద్రంలో నిర్వహించే వ్యవస్థాపక దినోత్సవంలో ఈ అవార్డును అందుకోనున్నట్లు తెలిపారు. ఈ అవార్డు రావడానికి కారణమైన కేంద్రం శాస్త్రవేత్తలకు, రైతులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

కొనసాగుతున్న జూడాల నిరసన



కడప రిమ్స్ ఆవరణలో నిరసన తెలుపుతున్న జూనియర్ డాక్టర్లు





నిరసన చిత్రాలు

కడప అర్బన్: కోల్‌కతా వైద్యకళాశాలలో వైద్యురాలిపై జరిగిన అత్యాచార, హత్య ఘటనకు నిరసనగా కడప రిమ్స్ ఆవరణలో వైద్యవిద్యార్థుల నిరసన కొనసాగుతోంది. ఆదివారం తాము చేస్తున్న దీక్షా శిబిరంలో అత్యాచారం, హత్య సంఘటనలను నిరసిస్తూ సామూహికంగా చిత్రాలను గీశారు. శిబిరంలో చిత్రాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్స్ నాయకులు నిఖిల్, మౌనిక తదితరులు మాట్లాడుతూ కోల్‌కత్తాలో మహిళా పీజీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య సంఘటనకు పాల్పడిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 19వ తేదీ నుంచి కడప రిమ్స్ ఆవరణంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభమవుతాయన్నారు.

గంగమ్మా..కాపాడవమ్మా

లక్కిరెడ్డిపల్లి: అనంతపురం గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని బోనాలు సమర్పించారు. తలనీలాలు అర్పించారు. వర్షాలు కురిపించమ్మా అని అమ్మవారిని వేడుకున్నారు. ఆలయ చైర్మన్ రెడ్డయ్య, ఆలయ ప్రత్యేకాధికారి మారుతీ ప్రసాద్ భక్తులకు సౌకర్యాలు కల్పించారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

కడపలో పుదుచ్చేరి హోంశాఖా మంత్రి

కడప అర్బన్: పుదుచ్చేరి హోంశాఖా మంత్రి నమశ్శివాయం 17న కడప పోలీస్ గెస్ట్ హౌస్‌కు విచ్చేశారు. పుదుచ్చేరి నుంచి కదిరి వెళుతూ రాత్రి పోలీస్ గెస్ట్ హౌస్‌లో ఆయన బస చేశారు. ఆదివారం ఉదయం ఆయన తిరుగు ప్రయాణమయ్యారు. కాగా పుదుచ్చేరి హోంమంత్రికి పోలీసులు గౌరవవందనం నిర్వహించారు.



పుదుచ్చేరి హోంశాఖా మంత్రి ఏ. నమశ్శివాయంకు గౌరవవందనం చేస్తున్న పోలీసులు

ఉత్తమ భవిష్యత్తు దిశగా ప్రోత్సహించాలి

జేసీ అదితిసింగ్



చిన్నారికి బహుమతి అందజేస్తున్న జేసీ అదితిసింగ్

కడప కల్చరల్: విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉండేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ అన్నారు. కడప బాలోత్సవం ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవం డాక్టర్ మృత్యుంజయరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ 78వ స్వాతంత్ర దినోత్సవ ఉత్సవాల సందర్భంగా కడప బాలోత్సవం వివిధ పోటీలు నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా పిల్లలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. పిల్లలకు ఆరోగ్యమైన జీవితం అనుభవించే హక్కు మనలాగానే ఉందని, మన ఆరోగ్యాన్ని మనం రక్షించుకుంటూ ఇతరులకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలన్నారు. పిల్లలకు ఇష్టమైన దానినే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అందించి వారికి ఉజ్వల భవిష్యత్తు ఉండేలా సహకరించాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి అనురాధ మాట్లాడారు. మండల విద్యాశాఖ అధికారి గంగిరెడ్డి, ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ వీర సుదర్శన్ రెడ్డి, కడప బాలోత్సవ కమిటీ సభ్యులు రాజశేఖర్ రాహుల్, సునీత, సరస్వతి ,మధుసూదన్, ఉషా తులసి , శివరాం, వెంకటేశ్వర్లు సమీర్ తదితరులు పాల్గొన్నారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

8 మంది సీఐల బదిలీ

కడప అర్బన్: వైఎస్ఆర్ జిల్లాలో పనిచేస్తున్న 8 మంది సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డిఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వులను జారీ చేశారు.

సీఐ పేరు	ప్రస్తుతం	బదిలీ
వై.నరేంద్ర రెడ్డి	వీఆర్, అనంతపురం	పీసీఆర్, కడప
కె. అశోక్‌రెడ్డి	ఎస్బీ, కడప	వీఆర్, కడప
ఆర్. ఈశ్వరయ్య	వీఆర్, కడప	దిశ-2, నంద్యాల
సి. దేవకిరణ్‌కుమార్	సైబర్ సెల్, కడప	ప్రొద్దుటూరు ట్రాఫిక్
ఆర్. అర్జున్ నాయక్	ప్రొద్దుటూరు ట్రాఫిక్	సైబర్ సెల్,కడప
జె. శంకరయ్య	ఫ్యాక్షన్ జోన్, కడప	వీఆర్, కడప
కె. పుల్లయ్య	వీ.ఆర్, సత్యసాయి	ఫ్యాక్షన్ జోన్, కడప
టి.నారాయణ యాదవ్	ఆర్ఎస్ఏఎస్‌టీఎఫ్,కడప	వీఆర్, కడప

ప్రొద్దుటూరులో వరదరాజుల పాలన!

- 60 రోజుల్లో 70కిపైగా రేషన్ షాప్‌ల డీలర్ల తొలగింపు
- ఎమ్మెల్యే వర్గీయులకే పట్టం
- మిగతా వర్గీయులకు కల్పించని ప్రాధాన్యత



ఆత్మహత్యకు పాల్పడిన డీలర్ కిట్టు (ఫైల్)

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరులో ప్రజాస్వామ్యం పూర్తిగా అటకెక్కింది. 'ఇక్కడంతా మాదే రాజ్యం .. మేం చెప్పిందే వేదం' అన్నట్లు వరద'రాజుల' పాలన సాగుతోంది. ఏకపక్షంగా తొలగించిన రేషన్ డీలర్ల ఉదంతం దీనికి సాక్ష్యం. వివరాల్లోకి వెళితే.. ఎన్నికల ఫలితాలు వెలువడిన మూడో రోజు నుంచే ప్రొద్దుటూరు నియోజకవర్గంలో రేషన్ షాప్‌ల డీలర్ల తొలగింపు ప్రక్రియను ప్రారంభించారు. ఈ ఏడాది జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. 12వ తేదీన చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే 7వ తేదీనే మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డుకు చెందిన రేషన్ షాప్ డీలర్ బాషాను బలవంతంగా తొలగించారు. రేషన్ షాప్‌కు సంబంధించిన బియ్యాన్ని ఎండీయూ వాహనంలో పంపిణీకి తీసుకెళుతుండగా అదే వార్డుకు చెందిన టీడీపీ నాయకుడు అధికార పార్టీ నేతతో ఫోన్ చేయించి వెంబడే దాడులు చేయించాడు. నిబంధనల ప్రకారం అధికారుల తనిఖీల్లో లొసుగులు కనిపించకపోయినా 'పెద్దాయన ఆఫీసు నుంచి ఫోన్ వచ్చింది, మీ రేషన్ షాప్ ఇవ్వాల్సిందే'నని అధికారులు ఒత్తిడి తెచ్చారు. అప్పటికప్పుడు ఈ పాస్ మిషన్‌ను స్వాధీనం చేసుకుని అధికార పార్టీ నేతకు అప్పగించారు.

- ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఉన్న రేషన్ డీలర్ కిట్టు అలియాస్ రామకృష్ణను ఈనెల నుంచి తొలగించారు. అదే వార్డుకు చెందిన టీడీపీ నాయకుడు ఈ షాప్‌ను తన బంధువులకు అప్పగించాడు. కిట్టు ఎన్నో ఏళ్లుగా రేషన్ షాప్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకునేవారు. తన ఆర్థిక ఇబ్బందులతోపాటు రేషన్ షాప్ తొలగించారనే కారణంగా ఆవేదనతో ఈనెల 7న డీలర్ కిట్టు విషద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పార్టీలకు సంబంధం ఉన్నా లేకున్నా తమ వర్గీయులకు కావాలని చెప్పి వరుసగా డీలర్లను తొలగించడం జరుగుతోంది.
- పెద్దశెట్టిపల్లె, గోపవరంతోపాటు ప్రొద్దుటూరు పట్టణంలో ఏళ్ల తరబడి నిర్వహిస్తున్న రేషన్ షాప్‌లను ముందు వెనుక చూడకుండా స్వాధీనం చేసుకుని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి వర్గీయులకు అప్పగించడం జరిగింది.
- వైఎంఆర్ కాలనీకి చెందిన డీలర్ రామిరెడ్డి తొలి నుంచి టీడీపీ వర్గీయుడే. 1986లో వరదరాజులరెడ్డి టీడీపీలో చేరినప్పటి నుంచి స్వయంగా రామిరెడ్డి కామనూరు గ్రామానికి సైకిల్‌లో వెళ్లి వచ్చేవారు. మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డికి ఈయన సమీప బంధువు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో తొలగించిన రేషన్ షాప్‌ను ఇటీవల వరదరాజులరెడ్డి మరో వ్యక్తికి అప్పగించారు. ఎన్నో ఏళ్లుగా చేసిన తన రేషన్ షాప్‌ను తిరిగి తనకు అప్పగించాలని రామిరెడ్డి గట్టి ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. శ్రీనివాసనగర్‌లో కూడా లింగారెడ్డి వర్గీయులకు ఇదే పరిస్థితి ఎదురైంది. కేవలం తన వర్గీయులకు, అనుచరులకు మాత్రమే వరద రేషన్ షాప్‌లను కేటాయించారనే ప్రచారం జరుగుతోంది.
- మండల పరిధిలోని చౌడూరు గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి 30 ఏళ్లకుపైగా గ్రామంలో రేషన్‌షాప్ నిర్వహిస్తున్నాడు. రెవెన్యూ అధికారులు వెళ్లి ఈ పాస్ మిషన్ ఇస్తే కేసు ఉండదని, ఇవ్వకుంటే కేసు నమోదు చేస్తామని బెదిరించి తీసుకొచ్చారు. వాస్తవానికి డీలర్ సుబ్బారెడ్డికి పార్టీ ముద్ర లేదు. అయితే తమ వర్గీయుడు అడుగుతున్నాడని రేషన్ షాప్ స్వాధీనం చేసుకుని అప్పగించారు.
- నియోజకవర్గానికి సంబంధించి ప్రొద్దుటూరులో 143 రేషన్ షాప్‌లు ఉండగా ఇప్పటికే 70కిపైగా రేషన్ షాప్‌లను మార్పు చేశారు. రాజుపాళెం మండలంలోని 24 రేషన్ షాప్‌ల్లో 12 రేషన్ షాప్‌లను తన వర్గీయులకు వరద కేటాయించారు.
- రెవెన్యూ అధికారులు సైతం పెద్దాయన చెప్పాడని ముందు వెనుక చూడకుండా, నిబంధనలను పట్టించుకోకుండా బలవంతంగా రేషన్ షాప్‌లను స్వాధీనం చేసుకుంటున్నారు. వాస్తవానికి ప్రస్తుతం పని చేస్తున్న రేషన్ డీలర్ రాజీనామా చేసిన తర్వాతే కొత్త వారికి రేషన్ షాప్‌లను అప్పగించాల్సి ఉంది. అయితే అధికారులు బెదిరించో, భయపడించో ఈ పాస్ మిషన్లు స్వాధీనం చేసుకుని మరొకరికి రేషన్ షాప్‌లను కేటాయిస్తున్నారు. రెండు మూడు రేషన్ షాప్‌లకు సంబంధించి ప్రస్తుతం ఉన్న డీలర్లకు లిఫ్టింగ్ అయిన సరుకులను కూడా వెనక్కి తీసుకుని అధికారులు కొత్త రేషన్ డీలర్లకు అప్పగించిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. వరుసగా రేషన్ డీలర్లను తొలగిస్తుండటంతో చివరికి ఎవరు మిగులుతారో చెప్పలేని పరిస్థితి నెలకొని ఉంది.

ఫొటోగ్రఫీలో ఏఎఫ్‌యూ విద్యార్థుల ప్రతిభ



బోరెడ్డి నితీష్‌రెడ్డి తీసిన ఫొటో
(ఇన్‌సెట్) బోరెడ్డి నితీష్‌రెడ్డి

ఏఎఫ్‌యూ: కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం ఫొటోగ్రఫీ విభాగం విద్యార్థులు ఫొటోగ్రఫీ కాంపిటీషన్స్‌లో సత్తాచాటారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కమ్యూనికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించి ఈ పోటీల్లో వైఎస్ఆర్ ఏఎఫ్‌యూలో బీఎఫ్ఏ ఫొటోగ్రఫీ ఫైనలియర్ విద్యార్థులు బోరెడ్డి నితీష్‌రెడ్డి రెండోస్థానం, అవుతా జ్యోతిచరణ్ మూడోస్థానంలో నిలిచారు. వీరికి ఈనెల 19న హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో బహుమతులు ప్రదానం చేయనున్నారు.



జ్యోతి చరణ్ తీసిన ఫొటో
(ఇన్‌సెట్) జ్యోతి చరణ్

క్లుప్తంగా

6 ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

కమలాపురం : మండలంలోని పెన్నా, పాపాఘ్ని నదిలో ఇసుక అక్రమంగా తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఆదివారం కమలాపురం పరిధిలోని పాపాఘ్ని నదిలో మూడు ట్రాక్టర్లు, అలాగే ఏటూరు సమీపంలోని పెన్నా నదిలో మూడు ట్రాక్టర్లు పట్టుకున్నట్లు ఎస్ఐ వివరించారు. అక్రమంగా ఇసుక, మట్టి, గ్రావెల్ తరలిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. మండల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు జరిగినా ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ పేర్కొన్నారు.

కడప రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని మహిళ మృతదేహం

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) మార్చురీలో గుర్తు తెలియని మహిళ మృతదేహం ఉందని ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఆమె తల్లిదండ్రులు, బంధువులు తగిన ఆధారాలతో తమను సంప్రదించాలని కోరారు.

మద్యం తాగి వాహనం నడిపిన వారిపై కేసు

పోరుమామిళ్ల : మద్యం తాగి వాహనం నడుపుతుండగా ఇద్దరిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఆదివారం ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. అలాగే బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతుండగా 8 మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. వారందరినీ సోమవారం కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

బాలుడిని ఢీకొన్న బైకు


కోమాలోకి వెళ్లిన సుధీర్

పోరుమామిళ్ల : ఈదుళ్లపల్లె వద్ద ప్రధాన రహదారిపై నడుచుకుంటూ వెళుతున్న యర్రంపల్లె సుధీర్ (చింటు)(15) అనే బాలుడిని బైకు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆదివారం సాయంత్రం వేగంగా బైక్‌పై వెళుతున్న వ్యక్తి ఢీ కొట్టడంతో సుధీర్ తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లాడు. గాయపడిన యువకుడిని 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం కడప రిమ్స్‌కు తరలించారు. దీనిపై ఎస్ఐ కొండారెడ్డిని విచారించగా ఇంకా ఫిర్యాదు అందలేదని, అందగానే కేసు నమోదు చేస్తామన్నారు.

జూదరుల అరెస్టు

పెద్దముడియం: మండలంలోని బోదుతిప్పనపాడు గ్రామంలో ఎనిమిది మంది జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ సుబ్బారావు తెలిపారు. జూదరుల వద్ద నుంచి రూ. 53,100 నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

యువతి ఆత్మహత్యాయత్నం

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని బాలాయపల్లె దళితవాడకు చెందిన నాగిపోగు కవిత అనే యువతి ఆదివారం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారకస్థితిలో ఉన్న కవితను కుటుంబ సభ్యులు ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

రామయ్య చెంతకు రైలు బండేదీ!

- ఆంధ్రా అయోధ్యపై కేంద్రం నిర్లక్ష్యం
- ఆగని ఎక్స్‌ప్రెస్ రైళ్లు
- రైలు సౌకర్యంపై నోరుమెదపని టీటీడీ
- పట్టించుకోని ఎన్డీఏ ప్రభుత్వం



రాజంపేట : పవిత్ర వైష్ణవ క్షేత్రాల్లో ఒకటి అన్నమయ్య జిల్లా ఒంటిమిట్టలో వెలసిన కోదండరామాలయం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పుడు భద్రాచలం ఉండేది. ఆ స్థానంలో ఇప్పుడు ఒంటిమిట్ట కోదండరామాలయం ప్రాచుర్యంలోకి వచ్చింది. ఒకరకంగా రైల్వేశాఖ తెలంగాణలో భద్రాచలం రైల్వేస్టేషన్‌కు ఇచ్చిన ప్రాముఖ్యతను ఒంటిమిట్ట రైల్వేస్టేషన్‌కు ఇవ్వడంలో నిర్లక్ష్యం ప్రస్ఫుటంగా కనిపిస్తోందని భక్తులు విమర్శిస్తున్నారు.

ముంబై–చెన్నై మార్గంలో నడిచే ఏ ఎక్స్‌ప్రెస్ రైలుకు కూడా ఒంటిమిట్ట స్టేషన్‌లో హాల్టింగ్ లేకపోవడం గమనార్హం. కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి సర్కారు నడుస్తోంది. రైల్వేపరంగా కేంద్రం నుంచి ఒంటిమిట్ట రైల్వేస్టేషన్ అభివృద్ధి, పలురైళ్ల హాల్టింగ్‌లపై ఒరిగిందేమీలేదు. ఇలాంటి పరిస్థితిలో అమరావతితోపాటు రామాలయం రైల్వేస్టేషన్ ఆధునికీకరణ, పలు రైళ్ల హాల్టింగ్ కల్పించి, పరోక్షంగా పర్యాటకపరంగా, యాత్రికుల సౌకర్యంపై దృష్టి సారించకపోవడం పలు విమర్శలకు దారితీస్తోంది. రైల్వేస్టేషన్ రాములోరి కల్యాణ వేదికకు అత్యంత సమీపంలో ఉన్నా అధికారులు ఆ దిశగా ఆలోచించకపోవడం విచారకరం.

రామాయణం వలయంలో..

రామాలయాన్ని రామాయణ వలయం పేరిట అయోధ్య, రామేశ్వరం, భద్రాచలం రోడ్ (కొత్తగూడెం) మీదుగా భక్తుల కోసం ప్రత్యేక రైలును రైల్వేశాఖ తీసుకొచ్చింది. అయితే ఈ రైలు ఒంటిమిట్ట రామయ్య చెంతకు వచ్చే పరిస్థితులు లేవు. ఆ అవకాశం కేంద్రం కల్పించలేదు. ఇటీవల కేంద్ర మంత్రివర్గం భద్రాచలం మీదుగా కొత్తలైనుకు ఆమోదం తెలిపింది. స్వయంగా రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్ భద్రాద్రి రామయ్య చెంతకు రైలుబండి వస్తుందని తాజాగా ప్రకటించడం విశేషం. మరీ ఆయన ఒంటిమిట్ట కోదండరాముని ఆలయం గురించి ఎందుకు పట్టించుకోలేదన్న విమర్శలను ఎదుర్కొంటున్నారు.

రాష్ట్రం నలుమూలల నుంచి..

శ్రీకాకుళం నుంచి కుప్పం వరకు వివిధ జిల్లాల నుంచి ఒంటిమిట్ట రామయ్యను దర్శించుకునేందుకు భక్తుల రాక రోజురోజుకు అధికమవుతోంది. ఒంటిమిట్టలో స్టేషన్ ఉన్నా భక్తులకు రైలు సౌకర్యం లేకపోవడంతో కడప వరకు ప్రయాణించి రోడ్డుమార్గంలో ఒంటిమిట్టకు చేరుకుంటున్నారు. సమీపంలో ఉన్న నందలూరు, రాజంపేటలో ఏ రైలుకు ఎప్పుడూ హాల్టింగ్ ఉంటుందో.. ఎప్పుడు ఎత్తివేస్తారో తెలియని దుస్థితి నెలకొంది.

రైలు సౌకర్యంపై నోరు మెదపని టీటీడీ

రాష్ట్ర రామాలయానికి రైలు సౌకర్యంపై తిరుమల తిరుపతి దేవస్థానం నోరు మెదపడం లేదన్న విమర్శలు భక్తుల నుంచి వినిపిస్తున్నాయి. రూ.100 కోట్ల మాస్టర్‌ప్లాన్‌తో ఒంటిమిట్ట కోదండరామాలయం, రాములోరి కల్యాణ వేదికను నిర్మించి వైష్ణవ క్షేత్రం రూపురేఖలు మార్చారు. అయితే ఈ క్షేత్రానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చేందుకు అవసరమైన రైలు సౌకర్యం అంశాన్ని రైల్వేశాఖకు తెలియజేయలేదు. రెండు ప్యాసింజర్ రైళ్లు తప్ప ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్‌లేదు. కనీసం రైల్వేస్టేషన్ అభివృద్ధి లేదు. ఇప్పటికైనా టీటీడీ ఈఓ రైల్వేశాఖకు ప్రతిపాదనలు చేయాలని భక్తులు కోరుతున్నారు.

భద్రాచలం తరహాలో స్టేషన్ అభివృద్ధి ఏదీ?

తెలంగాణ రాష్ట్రంలో ఉన్న భద్రాచలం రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేసిన తరహాలోనే ఒంటిమిట్ట రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాలనే ఆలోచనను దక్షిణ మధ్య రైల్వే విస్మరించిందనే అపవాదును మూటగట్టుకుంది. ముంబయి–చెన్నై కారిడార్ రైలుమార్గంలో నడిచే ప్రతి రైలుకు ఒంటిమిట్టలో స్టాపింగ్ ఇవ్వాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆధ్యాత్మిక వేత్తలు అంటున్నారు. రాష్ట్రప్రభుత్వం ఒంటిమిట్టను ఆంధ్రా భద్రాదిగా గుర్తించి, అభివృద్ధి చేస్తుంటే రైల్వేశాఖ తన వంతు పాత్రను పోషించలేదు. ఒంటిమిట్ట, భద్రాచలం రెండు పుణ్యక్షేత్రాలు దక్షిణమధ్య రైల్వేలోనే ఉండేది. భద్రాచలం స్టేషన్‌కు ఇస్తున్న ప్రాధాన్యతను ఒంటిమిట్టకు ఇవ్వడం లేదంటే వివక్షను ప్రదర్శించినట్లేనని భక్తులు భావిస్తున్నారు.

భద్రాచలం తరహాలోనే ఒంటిమిట్ట రైల్వేస్టేషన్‌కు ప్రాముఖ్యత ఇవ్వాలి



రైల్వేశాఖ భద్రాచలం రైల్వేస్టేషన్‌ను ఏ విధంగా అభివృద్ధి చేసిందో, అన్ని రైళ్లకు ఎలా స్టాపింగ్ ఇచ్చిందో అదే విధంగా ఒంటిమిట్ట రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేసి, దూరప్రాంతాల నుంచి భక్తులకు రైలు సౌకర్యం కల్పించాలి. స్థానిక ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డిల ద్వారా రైల్వే శాఖకు ఒంటిమిట్ట ప్రాచుర్యం తెలిసేలా నా వంతు కృషి చేస్తాను.

– ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే, రాజంపేట

అన్ని రైళ్లకు స్టాపింగ్ అవసరం



అన్ని రైళ్లకు ఒంటిమిట్ట రైల్వేస్టేషన్‌లో స్టాపింగ్ ఇస్తే అన్ని చోట్లనుంచి యాత్రికులు వస్తారు. రోడ్డు మార్గంలో వీలులేనివారు రైళ్లలో రామయ్య సన్నిధికి వస్తారు. ఒంటిమిట్ట రామయ్యపై కేంద్రం చిన్నచూపు చూస్తోంది. అందుకే భద్రాచలం తరహాలో రైల్వేపరంగా అభివృద్ధి చేయడం లేదు.

– సాంబయ్య, భక్తుడు, ప్రొద్దుటూరు

రాష్ట్ర రామాలయంపై రైల్వేకు ఎందుకింత చిన్నచూపు



రాష్ట్ర రామాలయం ఒంటిమిట్ట కోదండరామాలయం. టీటీడీ అభివృద్ధి చేసింది. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు వస్తున్నారు. కానీ రైల్వేపరంగా ఒక్క రైలు కూడా స్టాపింగ్ లేదు. రైల్వేశాఖ భద్రాచలానికి ఇస్తున్న ప్రాముఖ్యత ఒంటిమిట్టకు ఇవ్వడంలేదు.

– సుబ్బయ్య, భక్తుడు, దువ్వూరు

ఆర్టీసీ ఈడీ నియామకంపై అయోమయం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నియామకంపై అయోమయ పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో విజయవాడ, విజయనగరం, నెల్లూరు, కడప జోన్లు ఉన్నాయి. కడప పరిధిలో ఎనిమిది జిల్లాలు, 52 డిపోలు, ఒక వర్క్‌షాప్ ఉండగా, అందులో దాదాపు 25 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. నాలుగు జోన్లలో కడప జోన్ పెద్ద జోన్‌గా గుర్తింపు పొందింది. ప్రతినిత్యం ఈడీ పలు అంశాలపై నిర్ణయాలు తీసుకుని అధికారులు, ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ ముందుకు తీసుకు వెళుతుంటారు. అలాంటి కీలక అధికారి లేకపోవడంతో సంస్థ అధికారులు, ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదిలా ఉండగా గతంలో ఇక్కడ ఈడీగా పనిచేస్తున్న గిడుగు వెంకటేశ్వరరావును మరో చోటికి బదిలీ చేసేవరకు విజయవాడలోని ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్‌దండే ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త ఈడీని త్వరితగతిన నియమించాలని పలువురు అధికారులు, యూనియన్ నాయకులు కోరుతున్నారు.

ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా

పెండ్లిమర్రి : మండలంలోని చిన్నదాసరిపల్లె గ్రామ సమీపంలోని వంక వద్ద నీళ్ల ట్యాంకరు ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడిన సంఘటనలో ఆదివారం పాతసంగటిపల్లె గ్రామానికి చెందిన గుణవర్ధన్‌రెడ్డి అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. గుణవర్ధన్‌రెడ్డి వెయ్యినూతలకోన దేవస్థానంలో బంధువుల వివాహ కార్యక్రమానికి నీళ్ల ట్యాంకర్ ట్రాక్టర్ తీసుకెళ్లాడు. తిరిగి ట్రాక్టర్‌ను ఇంటికి తీసుకొని వస్తుండగా చిన్నదాసరిపల్లె గ్రామ సమీపంలోని వంక వద్ద అదుపు తప్పి ట్రాక్టర్ వంకలో బోల్తా పడింది. ట్రాక్టర్ అతని మీద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం వేలూరు ఆసుపత్రికి తరలించారు.

తల్లీబిడ్డల మృతిపై అనుమానాలు నివృత్తి చేయండి

నిజ నిర్ధారణ కమిటీ డిమాండ్


సంఘటనపై స్థానికులను విచారిస్తున్న నిజనిర్ధారణ కమిటీ సభ్యులు

రాయచోటి అర్బన్ : రాయచోటి పట్టణం బోసనగర్‌లోని తొగటవీధిలో శనివారం తెల్లవారుజామున ఎర్రగుడి రమాదేవి, ఆమె ఇరువురు పిల్లలు మృతి చెందిన ఘటనపై అనుమానాలను నివృత్తి చేయాలని నిజ నిర్ధారణ కమిటీ డిమాండ్ చేసింది. తల్లీబిడ్డల మృతిపై పౌరహక్కుల సంఘం, ప్రజాస్వామ్యహక్కుల పరిరక్షణ సంస్థ, ఎమ్మార్పీఎస్, రజక సంఘం సభ్యులతో ఏర్పడిన నిజనిర్ధారణ కమిటీ ఈ సంఘటనపై విచారణ జరిపింది. అనంతరం ఆయా సంఘాల ప్రతినిధులు విలేకరులతో మాట్లాడారు. రమాదేవి తన ఇరువురు బిడ్డలను ముందుగా చంపిన తర్వాత ఆమె ఇంట్లో గ్యాస్‌లీక్ చేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా పోలీసులు ముందుగానే నిర్ధారణకు వచ్చి మృతురాలిపైనే హత్య కేసు నమోదు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. రమాదేవి ఆత్మహత్య చేసుకున్నది నిజమైతే ఆమె మృతదేహం పక్కనే ఒక ప్లాస్టిక్ బాటిల్ ఏమాత్రం కాలకుండా ఉండడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఆ బాటిల్‌పై ఉన్న వేలి ముద్రలు ఎవరివో తెలుసుకోవడానికి పోలీసులు ప్లాస్టిక్ బాటిల్‌ను వేలి ముద్రల నిపుణులకు పంపకపోవడం మరిన్ని అనుమానాలకు తావిస్తోందన్నారు. నిజంగానే రమాదేవి బెడ్‌రూంలో గ్యాస్ లీక్ చేసుకుని చనిపోయి ఉంటే అదే రూములోని బెడ్‌కాని, ఇతర వస్తువులు కాని ఎందుకు అగ్నికి ఆహుతి కాలేదన్న అనుమానాలు ఉన్నాయన్నారు. ఇంట్లోనుంచి పొగవచ్చిన వెంటనే ఇంట్లోకి వెళ్లి చూడగా ఏమాత్రం కదలకుండా పడి ఉన్న శవాలను చూశామని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారన్నారు. ఈ సంఘటనకు నాలుగైదు గంటల ముందు రమాదేవికి అదేవీధిలోని మరొక మహిళతో ఘర్షణ జరిగిందని వీధివాసులు తమకు తెలిపారన్నారు. ఘర్షణకు దిగిన మహిళ భర్తకు మృతురాలు లక్షలాది రూపాయలు అప్పుగా ఇచ్చినట్లు, ఇటీవల కాలంలో ఆ సొమ్మును తిరిగి చెల్లించాలంటూ మృతురాలు గట్టిగా ఒత్తిడి తెచ్చినట్లు తమ విచారణలో తేలిందన్నారు. ఇన్ని వరుస సంఘటనల నేపథ్యంలో రమాదేవిది ఆత్మహత్య అని పోలీసులు చెబుతుండటం నమ్మశక్యంగా లేదన్నారు. మృతి ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు విచారణ జరిపి తల్లీబిడ్డల మృతికి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కమిటీ సభ్యులు సి. వెంకటేశ్వర్లు, టి.ఈశ్వర్, రామాంజనేయులు, రవిశంకర్, పి.రెడ్డెయ్య, మోటపోతుల రవిశంకర్, ఇర్షాద్, రమేష్ బాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కృష్ణా జట్టు ఘన విజయం


153 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన విశాఖ బ్యాట్స్‌మన్ పరమ్‌వీర్‌సింగ్


148 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన కృష్ణా బ్యాట్స్‌మన్ రాజేష్


136 పరుగులు చేసిన కృష్ణా బ్యాట్స్‌మన్ వరుణ్ సాత్విక్


5 వికెట్లు తీసిన నెల్లూరు బౌలర్ హమీద్


5 వికెట్లు తీసిన కృష్ణా బౌలర్ గీత్


122 పరుగులు చేసిన శ్రీకాకుళం బ్యాట్స్‌మన్ థామస్ రామ్‌కుమార్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్–19 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో కృష్ణా జట్టు ఘనవిజయం సాధించింది. కేఓఆర్ఎం మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 221 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన కృష్ణా జట్టు 73.5 ఓవర్లలో 340 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని టి. వరుణ్ సాత్విక్ 139 బంతుల్లో 136 పరుగులు చేశాడు. ఈయనకు జతగా రాజేష్ 148 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. నెల్లూరు బౌలర్లు హమీద్ 5, లోకేష్ 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 29.3 ఓవర్లలో 134 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని హమీద్ 31 పరుగులు, మన్విత్‌రెడ్డి 22 పరుగులు చేశారు. కృష్ణా బౌలర్లు గీత్ 5, యశ్వంత్ 3 వికెట్లు తీశారు. దీంతో కృష్ణా జట్టు ఇన్నింగ్స్, 97 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది. కాగా నెల్లూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 109 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

విశాఖ జట్టుకు ఆధిక్యం..

వైఎస్ఆర్ఆర్–ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 72 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన విశాఖ జట్టు 103 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 394 పరుగులు చేసింది. జట్టులోని ఈశ్వర్ రిత్విక్ 70, యువన్ 80 పరుగులు చేయగా, పరమ్‌వీర్ సింగ్ 153 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఈయనకు జతగా కేపీఎస్ ప్రసాద్ 83 పరుగులతో క్రీజులో ఉన్నాడు. దీంతో విశాఖ జట్టు 188 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. కాగా కడప జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 206 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

హోరాహోరీగా చిత్తూరు, శ్రీకాకుళం మ్యాచ్..

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 79 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన శ్రీకాకుళం జట్టు 86 ఓవర్లలో 356 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని థామస్ రామ్‌కుమార్ 122 పరుగులు చేయగా, సుశాంత్ 53 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్లు బాలాజీ 4, సాయి హర్షిత్‌రెడ్డి 4 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 13 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 49 పరుగులు చేసింది. జట్టులోని ఎం. హర్షసాయిరెడ్డి 19 పరుగులు, చరణ్‌జీత్ 28 పరుగులతో క్రీజులో ఉన్నారు. కాగా చిత్తూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 289 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. రెండోరోజు ఆట ముగిసే సమయానికి చిత్తూరు జట్టు 18 పరుగుల వెనుకంజలో ఉంది.

జిల్లా వ్యాప్తంగా 17 మంది ఎస్ఐల బదిలీ

కడప అర్బన్ : వైఎస్ఆర్ జిల్లా వ్యాప్తంగా 17 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలిలా ఉన్నాయి.

ఎస్ఐ పేరు	ప్రస్తుతం	బదిలీ స్థానం
కె. శ్రీకాంత్	శ్రీసిటీ పోలీస్, తిరుపతి	బద్వేల్ రూరల్ పీఎస్
వి. మల్లికార్జున రెడ్డి	వి.ఆర్, కడప	డీఎస్‌బీ, కడప
సి. లక్ష్మీనారాయణ	వి.ఆర్, కడప	తలమంచిపట్నం పీఎస్
పి. వెంకటసురేష్	వి.ఆర్, కడప	ప్రొద్దుటూరు రూరల్ పీఎస్
డి. సునీల్‌కుమార్ రెడ్డి	వి.ఆర్, కడప	సైబర్ క్రైమ్, కడప
పి. హైమవతి	వి.ఆర్, కడప	డీఎస్‌బీ, కడప
ఈ. వెంకటయ్య	వి.ఆర్, కడప	ఫ్యాక్షన్ జోన్, కడప
బి. ప్రదీప్‌కుమార్	వి.ఆర్, కడప	డీటీఆర్‌బీ, కడప
ఎన్. శ్రీధర్‌బాబు	వి.ఆర్, కడప	డీటీసీ, కడప
పి.ఎస్. రాజ్‌కుమార్	వి.ఆర్, కడప	ఆర్ఎస్ఏఎస్‌టీఎఫ్, కడప
బి. ప్రకాష్‌రావు	వి.ఆర్, కడప	సీసీఎస్, కడప
పి. నారాయణ	వి.ఆర్, కడప	సీసీఎస్, కడప
ఎం.వి. సుబ్బన్న	వి.ఆర్, కడప	డీఎస్‌బీ, కడప
కె. శాంతమ్మ	వి.ఆర్, కడప	ఏహెచ్‌టీయూ, కడప
ఎస్. అనసూయ	దిశ యు/జి పీఎస్	పీసీఆర్, కడప
వి. లక్ష్మీదేవి	వి.ఆర్, కడప	ఫ్యాక్షన్ జోన్, కడప
సి. ద్వారక	వి.ఆర్, కడప	ఫ్యాక్షన్ జోన్, ప్రొద్దుటూరు

కారు ఢీకొని వ్యక్తి మృతి


మృతి చెందిన షేక్ షరీఫ్

దువ్వూరు : మండలంలోని కానగూడూరు జాతీయ రహదారిపై ఆదివారం కారు ఢీకొని కృష్ణంపల్లె గ్రామానికి చెందిన షేక్ షరీఫ్ (48) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. షరీఫ్ కానగూడూరు వద్ద రోడ్డు దాటుతుండగా కడప నుంచి కర్నూలు వైపు వెళుతున్న కారు ఢీ కొందని ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు. మృతుడు బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేశామని, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

నేటి యువతకు స్ఫూర్తి నాగిరెడ్డి రచనలు


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

కడప కల్చరల్ : ఎంసీ నాగిరెడ్డి రచించిన 'శతక మధురిమలు', 'బంధాలు– బాధ్యతలు 'పుస్తకాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని ప్రముఖ సినీ నిర్మాత కె.బాబు రెడ్డి అన్నారు. కడప సర్వేపల్లి రాధాకృష్ణనగర్‌లోని రామకృష్ణ వానప్రస్థాశమంలో ఆదివారం ఆయన ఈ పుస్తకాలను ఆవిష్కరించారు.

నేటి సమాజం పట్ల, గురువుల పట్ల, తల్లిదండ్రుల పట్ల యువత బాధ్యతలను రచయిత గుర్తు చేశారన్నారు. సభాధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు మంచి గుణాలు, విలువలు నేర్పాల్సిన అవసరం ఉందన్నారు. రచయిత ఈ విషయాన్ని ఈ పుస్తకాల ద్వారా స్పష్టం చేశారన్నారు. డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి ఈ పుస్తకాలలోని ప్రత్యేకతల గురించి మాట్లాడారు. డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, జి.సుబ్బిరెడ్డి, బి.శివరామిరెడ్డి, కేవీ రమణారెడ్డి, రామలింగం, పాపిరెడ్డి, కొప్పోలు రెడ్డి శేఖర్‌రెడ్డి కూడా మాట్లాడారు. రచయిత నాగిరెడ్డి, లక్ష్మీనరసమ్మ దంపతులను సాహితీ మిత్రులు, ఆత్మీయులు, బంధువులు ఘనంగా సన్మానించారు.

కడపలో చోరీ

కడప అర్బన్ : కడప నగరం తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో బిల్టప్ సమీపంలోని విజయదుర్గా కాలనీలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఆ ఇంటిలో నివాసముంటున్నవారు ఇంటికి తాళం వేసి వెళ్లినప్పుడు గుర్తు తెలియని వ్యక్తులు లోపలికి ప్రవేశించి, విలువైన బంగారు ఆభరణాలను, ఇతర విలువైన వాటిని చోరీ చేసుకుని వెళ్లినట్లు సమాచారం. కాగా ఆ ఇంటిలోని వారు ప్రస్తుతానికి లేకపోవడం వల్ల పూర్తి వివరాలు తెలియరాలేదు. ఈ సంఘటనపై తమకు ఇంకా ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఈ బంధం.. ఎన్నటికీ విడిపోదు!

- ఏటా అన్న విగ్రహానికి రాఖీ కడుతున్న చెల్లెలు గాయత్రి


సోదరుడి విగ్రహానికి రాఖీ కడుతున్న గాయత్రి (ఫైల్)

కడప కల్చరల్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని ఓ కుగ్రామంలో ప్రతి రాఖీ పండుగ సందర్భంగా అన్నయ్య యుగంధర్ విగ్రహానికి రాఖీ కడుతున్నారు ఓ చెల్లి. అన్నయ్య మరణానంతరం ఆమె క్రమం తప్పకుండా ఆయన విగ్రహానికి రాఖీ కట్టి అన్నతో తనకు గల అనుబంధాన్ని కొనసాగిస్తున్నారు. విగ్రహానికి రాఖీనా? అంటూ కొందరు విచిత్రంగా చూసినా.. ఎగతాళిగా మాట్లాడినా ఆమె మాత్రం ఈ పద్ధతిని వదలడం లేదు. భౌతికంగా లేకపోయినా అన్నయ్య తన హృదయంలో ఎప్పటికీ సజీవంగానే ఉన్నారని సోదరి గాయత్రి పేర్కొంటారు.

ఒంటిమిట్ట మండలం రాచపల్లె గ్రామానికి చెందిన సరోజనమ్మ, కొండూరు జయరామరాజు కుమారుడు లాన్స్ నాయక్ కె.యుగంధర్ ఆర్మీలో ఉంటూ వీరమరణం పొందారు. గ్రామస్తులు యుగంధర్ స్మారకార్థం స్వగ్రామం రాచపల్లెలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి నుంచి చెల్లెలు గాయత్రి, తమ్ముడు విశ్వనాథ్ అన్న విగ్రహం వద్ద ఏటా రాఖీ పండుగ నాడు చిన్న సందడి చేస్తుంటారు. ఉదయాన్నే సోదరి గాయత్రి అన్నయ్య విగ్రహానికి రాఖీ కడుతుంటారు. దీన్ని అందరూ విచిత్రంగా భావిస్తున్నా తనకు ఎంతో ఆత్మ తృప్తి లభిస్తుందని అంటారు గాయత్రి. నేటి పరిస్థితుల్లో ఇది ఆదర్శంగానే నిలుస్తోంది.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు

జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్‌రాజు హెచ్చరిక


కడప ఎస్వీ డిగ్రీ కళాశాల పరిసరాల్లో కంప చెట్లను తొలగింపజేస్తున్న పోలీసులు

కడప అర్బన్ : జిల్లాలో 15 రోజుల వ్యవధిలో బహిరంగ మద్యపానంపై మొత్తం 1064 మందిపై కేసులు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు బహిరంగ మద్యపానం జరిగే ప్రాంతాలపై పోలీసు అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యపానం సేవించడం చట్ట వ్యతిరేకమని, నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం కఠినచర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 1064 మందిపై కేసులను నమోదు చేశారు. ఇందులో కడప సబ్ డివిజన్ పరిధిలో 155 కేసులు, మైదుకూరు సబ్ డివిజన్ పరిధిలో 311, ప్రొద్దుటూరు సబ్ డివిజన్ పరిధిలో 232, పులివెందుల సబ్‌డివిజన్ పరిధిలో 182 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో బహిరంగంగా మద్యం సేవించే ప్రాంతాలను పోలీస్ అధికారులు, సిబ్బంది గుర్తించి పంచాయతీరాజ్,మున్సిపల్ శాఖల సిబ్బంది సహకారంతో స్వయంగా శుభ్రం చేయించారు.